# స్మార్ట్ అసెస్‌మెంట్ పోర్టల్‌పై అవగాహన






ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శుక్రవారం | 25 సెప్టెంబరు , 2026 | పేజీలు :08


# క్రాప్ బుకింగ్‌లో వేగం పెంచాలి

● జిల్లాలో ఎరువులకు కొరత లేదు ● ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం లక్ష్యం చేరుకోవాలి ● ప్రత్యామ్నాయ పంటల సాగును పెంచాలి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల** : వ్యవసాయ శాఖ అధికారులు క్రాప్ బుకింగ్‌లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. క్రాప్ బుకింగ్, ఎరువుల సరఫరా, ఆయిల్ ఫామ్ సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పీఏసీఎస్ సెక్రటరీలు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, మార్క్ ఫెడ్ అధికారులతో కలిసి జిల్లా సమీకృ కార్యాలయాల సముదాయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు క్రాప్ బుకింగ్ 56 శాతం పూర్తయిందని మిగతా బుకింగ్‌ను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ పర్యవేక్షణ చేస్తూ లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు.

### 23 వేల మెట్రిక్ టన్నులు సరఫరా

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటల సాగు కోసం వ్యవసాయ శాఖ అంచనాల మేరకు మొత్తం 21 వేల మెట్రిక్ టన్నుల ఎరువు అవసరమని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు 23 వేల మెట్రిక్ టన్నులు విక్రయాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇంకా రెడు వేల మెట్రిక్ టన్నుల ఎరువులు నిలువ ఉన్నాయని జిల్లాలో ఎరువులకు కొరత లేదని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు.

### ఆయిల్ ఫామ్ సాగువైపు ప్రోత్సహించాలి

ఆయిల్ ఫామ్‌తో వచ్చే లాభాలు, ప్రభుత్వ సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పిస్తూ సాగువైపు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్ మద్ధతు ధర, దిగుబడి రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయిల్ ఫామ్ టన్ను ధర ప్రస్తుతం రూ.24025 ఉందని వెల్లడించారు. రైతుల నుంచి ప్లాంట్, డ్రిప్ డీడీలు తీసుకొని సాగు లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో ఆయిల్ ఫామ్ దిగుబడి వస్తుందని జిల్లాకు సమీపంలోనే ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. రైతులను ప్రోత్సహించాలని అన్నారు.

### లాభాలు వివరించాలి

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదు అవుతుందని తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్, కూరగాయలు, పండ్ల తోటలు, పప్పు ధాన్యాలు, ఇతర పంటలు సాగు చేసేలా లాభాలు వివరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్.శరత్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి అఫ్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్** : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించి, చేయూత పెన్షన్లకు సంబంధించిన ఫీల్డ్ వెరిఫికేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గురువారం సుల్తానాబాద్ మండలంలోని రేగడి మద్దికుంట గ్రామంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించారు.గ్రామంలో చేయూత పింఛన్ల దరఖాస్తులకు సంబంధించి జరుగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన తీరును పరిశీలించారు.అర్హులైన లబ్ధిదారుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు సకాలంలో అందాలనే ఉద్దేశంతోనే ఈ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టడం జరిగిందని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, పూర్తిగా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ప్రభుత్వం నుంచి అందవలసిన చేయూత పెన్షన్ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో సుల్తానాబాద్ తహశీల్దార్,యం.డి బషీరుద్దీన్, ఎం.పీ.డీవో దివ్యదర్శన రావు,పంచాయతీ కార్యదర్శి,సంబంధిత శాఖల అధికారులు,పాల్గొన్నారు.

# రుణ లక్ష్యాల సాధనలో.. బ్యాంకర్లు చొరవ చూపాలి

## అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్** : జిల్లాలో వివిధ ప్రభుత్వ ఆర్థిక మద్ధతు పథకాల కింద నిర్దేశించిన రుణ లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు బ్యాంకర్లు, సంబంధిత అధికారులు పూర్తి సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ, డిఎల్ఆర్‌సీ సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, స్వయం సహాయక సంఘాలు, నిరుద్యోగ యువతకు ఆర్థిక తోడ్పాటు అందించడంలో బ్యాంకర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రుణ ధరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పీఎం స్వనిధి పథకానికి సంబంధించి వివిధ విడతల పెండింగ్ ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గత ఏడాది రూ.20 వేల కోట్లకు పైగా రుణాలు202526 ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా రూ.20,000.67 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.5975.41 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.2768.59 కోట్లు, గృహ రుణాలకు రూ.197.15 కోట్లు, విద్యా రుణాలకు రూ.17.31 కోట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

### రుణాల రికవరీ-రెన్యూవల్ క్యాంపులు

అర్హులైన రైతులందరికీ రుణాలు అందేలా చూడటంతోపాటు పాత రుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకునేలా వ్యవసాయ శాఖతో కలిసి బ్యాంకర్లు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే లబ్ధిదారులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా అధికారులు పర్యవేక్షించి రికవరీ శాతం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### రూ.14,846 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ

202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.14,846 కోట్లతో రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను

తరువాయి 2లో

## తాండ్ర అక్షిత రాణి కుటుంబానికి ప్రభుత్వం అండ :మంత్రి అల్లూరి



**ప్రజాపక్షం/పెద్దపల్లి** : సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామంలో ఇటీవల హత్యకు గురైన తాండ్ర అక్షిత రాణి తల్లిదండ్రులను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా,రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ పరామర్శించారు.ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ అక్షిత రాణి హత్య ఘటనలో నిందితులకు కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని అక్షిత రాణి హత్య ఘటనకు బాధ్యులైన వారిని ప్రత్యేక దర్యాప్తు ద్వారా గుర్తించి, చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా

తరువాయి 2లో

# సిఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను కార్మికులు, నేతన్నలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో చేనేత, జౌళి కార్యాలయంలో చేనేత కార్మికులు, ఆసాములు, యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సెప్టెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్దకు ప్రతి ఒక్కరూ చేరుకోవాలని అక్కడి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి సభా ప్రాంగణం వరకు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా కాలేజ్ గ్రౌండ్‌కు చేరుకున్న అనంతరం కార్మికులు, రైతులు, యువత మధ్య సుమారు మూడు కిలోమీటర్ల మేర పాదయాత్రగా సభా ప్రాంగణానికి వెళ్లనున్నారని తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందించాలని ముఖ్యమంత్రి సభకు వెళ్లే సమయంలోనే వినతిపత్రాలను సమర్పించేలా కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సిరిసిల్లలోని నేత కార్మికులు, టెక్స్‌టైల్ రంగ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఆసుపత్రి సిబ్బంది తదితర రంగాల్లో పని చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 2023 తర్వాత రావాల్సిన యార్న్ సబ్సిడీ, టెక్స్‌టైల్ పార్క్‌లోని సమస్యలు, కార్మికులకు వేతనాలు సకాలంలో అందకపోవడం వంటి అంశాలపై యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని తెలిపారు. వర్కర్ టు ఓనర్ పథకానికి సంబంధించిన షెడ్లను కార్మికులకు అందించాలనే డిమాండ్‌ను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. సిరిసిల్లలో సుమారు 5600 నుంచి 6 వేల మంది కార్మికులు ఉన్నారని ప్రస్తుతం ఉన్న షెడ్లను దశలవారీగా మరింత మంది కార్మికులకు అందించే అంశాన్ని పరిశీలించాలని గతంలో చర్చించిన విషయాన్ని గుర్తు చేశారు.

### పేద పిల్లలకు నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

సిరిసిల్లలో పేద, కార్మిక కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైందని ఆది శ్రీనివాస్ తెలిపారు. సుమారు 1500 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కల్పించే ఈ పాఠశాలలో సెంట్రల్ సిలబస్ తరహాలో విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గానికి సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని వెల్లడించారు. ముఖ్యమంత్రి సభను రాజకీయ కార్యక్రమంలా కాకుండా జిల్లాలోని పేదలు, కార్మికులు, నేతన్నలు, రైతులు, యువత తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వేదికగా ఉపయోగించుకోవాలని కోరారు. సిరిసిల్ల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విప్ విజ్ఞప్తి చేశారు.

### ముఖ్యమంత్రి సభా స్థలాన్ని పరిశీలించిన విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈనెల 30న సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో సభా ఏర్పాట్లను గురువారం ఆది శ్రీనివాస్ జిల్లా ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి సభా స్థలాన్ని పరిశీలించారు. సభా ప్రాంగణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, ప్రజలు కూర్చునే ప్రదేశాలు, వాహనాల పార్కింగ్ ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. సీఎం పర్యటన సందర్భంగా ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు, ఆకునూరి బాలరాజు, చొప్పదండి ప్రకాశ్, వెంకటరమణ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మార్ట్ అసెస్‌మెంట్ పోర్టల్‌పై అవగాహన

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను, వాటికి సంబంధించిన సాక్ష్యాలను పరిశీలించడానికి వీలుగా ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ స్మార్ట్ అసెస్‌మెంట్ పోర్టల్‌ను పకడ్బందీగా ఉపయోగించుకోవాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను, నిర్వాహకులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ స్మార్ట్ అసెస్‌మెంట్ పోర్టల్ పై అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అవగాహన కార్యక్రమం నిర్వహించారుఇది ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను వాటికి సంబంధించిన సాక్ష్యాలను పరిశీలించడానికి పూర్తిగా కృత్రిమ మేధస్సు ఆధారితంగా పనిచేసే పోర్టల్ అని, ఇందులో భాగంగా (ఏఐ) ఎనేబుల్డ్ ఎవిడెన్స్ వెరిఫికేషన్ (ఏఐ ఆధారిత సాక్ష్యాల పరిశీలన) విధానం ఉంటుందని, కొనుగోలు కేంద్రాల నిర్వహణను ఫోటో సాక్ష్యాల ద్వారా ఏఐ సహాయంతో సరిచూడటానికి ఇది ఉపయోగపడుతుందని వివరించారు.ఇందులో మొత్తం 16 ప్రశ్నలు ఉంటాయని, ప్రతి ప్రశ్నకు సరైన సమాధానం ఎంచుకొని దానికి సంబంధించిన ఫోటోను అప్‌లోడ్ చేయాలని,అప్‌లోడ్ చేసిన ఫోటోను ఏఐ పూర్తిగా విశ్లేషించి, అది కరెక్టా కాదా, డూప్లికేట్ ఫోటోలా, సరైన లోకేషన్‌లో ఉందా లేదా అని తనిఖీ చేసి L0 నుండి L5 వరకు గ్రేడింగ్ ఇస్తుందని తెలిపారు.తాత్కాలిక కేంద్రాలకు కనీసం L3 గ్రేడింగ్, పర్మనెంట్ కేంద్రాలకు L4 గ్రేడింగ్ ఉండాలని, L3 L4 కంటే తక్కువ గ్రేడింగ్ ఉన్నట్లయితే మౌలిక వసతుల కల్పన నిధులు ఆపబడతాయని, ఫోటోలు స్పష్టంగా ఉండాలని, టార్పాలిన్ వంటివి స్పష్టంగా కనబడేలా మంచి వెలుతురులో ఫోటో తీయాలని, వేరే ఫోటోలను మళ్లీ ఫోటో తీసి పెట్టడం,ఎడిట్ చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని, అప్‌లోడ్ చేసే ఫోటో ప్రశ్నలోని కంటెంట్‌కు సరిపోవాలని, ఫోటో ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ లోకేషన్‌లోనే తీసినదై ఉండాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్,అధికారులు,పాల్గొన్నారు.

## తాండ్ర అక్షిత రాణి కుటుంబానికి ప్రభుత్వం అండ మంత్రి అల్లూరి

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటామని, నిందితులపై చార్జిషీట్ నమోదు చేసి, కేసును పటిష్టంగా దర్యాప్తు చేసేలా పోలీసు శాఖకు ఆదేశాలు ఇస్తామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ద్వారా బాధిత కుటుంబానికి రూ. 4.12 లక్షల పరిహారం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మరో రూ. 4,12,000 అందజేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, ఘటనకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.అక్షిత రాణి కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసే రూ.5 లక్షల ఇందిరమ్మ ఇంటిని బాధిత కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారు గతంలోసుల్తానాబాద్‌లో జరిగిన ఘటనలో 24 గంటలు గడవకముందే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత ఘటనపై దర్యాప్తు కూడా వేగంగా కొనసాగుతోందని, ఇప్పటికే సుమారు 90 నుంచి 95 శాతం వరకు క్లూలను సేకరించినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి 4 లక్షల 12 వేల 500 రూపాయలు చెక్కును పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్,మార్కెట్ చైర్మన్, సింగిల్ విండోచైర్మన్లు ,సంబంధిత ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, జిల్లా అధికారులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కోనేరుపల్లి, కాట్నపల్లిలో స్వచ్ఛతా హీ సేవా

**ప్రజాపక్షం / చొప్పదండి :** మండలంలోని కోనేరుపల్లి, కాట్నపల్లి గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా జన్ భాగీదారీ, శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించారు. సహకార సంఘం చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రమదానం చేశారు. ఎంపిడివో వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యమని జలసిరి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాట్నపల్లి సర్పంచ్ గన్ను శ్రీనివాస్ రెడ్డి, కోనేరుపల్లి సర్పంచ్ కాసు వేణుగోపాల్ రాజు, ఏపీఎం వాణిశ్రీ, ఉప సర్పంచ్ గన్ను నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన పెన్షన్ల ధరఖాస్తుల పరిశీలన

**ప్రజాపక్షం / గంగాధర :** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా పెన్షన్ల కోసం ధరఖాస్తు చేసుకున్న అర్హులకు పెన్షన్లు అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గంగాధర మండలంలోని నూతన పెన్షన్ల ధరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుంది. మండలంలోని ఒద్యారం గ్రామంలో గురువారం నూతన పెన్షన్ల ధరఖాస్తులను ఎంపిడివో దమ్మని రాము స్వయంగా ధరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు. వితంతువులు, దివ్యాంగుల నుంచి అందిన ధరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ధరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, వయస్సు ధృవీకరణ పత్రాలను సరిగ్గా జత చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



## కుంటలా మారిన ప్రధాన రహదారి

**ప్రజాపక్షం / గన్నేరువరం :** గన్నేరువరం మండల కేంద్రం నుంచి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారై ప్రయాణీకుల పాలిట శాపంగా మారింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు, బాటసారులు నరకాన్ని చూస్తున్నారు. రహదారిపై అక్కడక్కడ పెద్దపెత్తున ఏర్పడిన గుంతల్లో నీరు చేరడంతో రోడ్డు కాస్తా నీటి కుంటను తలపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారడంతో ప్రయాణీకులు ఆ మార్గంలో వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది. గుంతల లోతు తెలియక పలువురు ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయపడిన ఘటనలు చోటు చేసుకున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు అత్యంత అధ్వాన్న స్థితికి చేరినా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ గైడ్ల పంపిణీ

**ప్రజాపక్షం / చొప్పదండి :** యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్నకొండ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ గౌడ్లను పంపిణీ చేశారు. ఈ ఏడాది పరీక్షకు ధరఖాస్తు చేసిన 8 మంది విద్యార్థులకు 6 గౌడ్లను ఉచితంగా అందజేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో స్కాలర్‌షిప్ సాధించాలని యూత్ ఫర్ సేవా వరంగల్ చాప్టర్ ప్రతినిధి కందగట్ల సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మణ్ కుమార్, ఉపాధ్యాయులు కనిగంటి రాజమౌళి, గంగాధర్, ప్రార్థన, అనిత, మీనాక్షి,కిషన్ విద్యార్థులు పాల్గొన్నారు.



## పట్టా పొందిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

**ప్రజాపక్షం / గంగాధర :** గంగాధర మండలంలోని గట్టుబూత్కూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ మల్లాపురం రాజేశ్వరి రాజేశం గౌడ్ ఆధ్వర్యంలో ఏడీఏ ప్రియదర్శిని గురువారం ఫార్మర్ రిజిస్ట్రీ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ప్రియదర్శిని మాట్లాడుతూ ఆగస్టు 13, 2026 వరకు కొత్త పట్టా పాస్ బుక్స్ వచ్చి ఇంకా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కాని రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

## రుణ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు చొరవ చూపాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో ఆవిష్కరించారు. ప్రణాళిక కేటాయింపుల వివరాలు.వ్యవసాయ రంగం రూ.5,755 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగం రూ.3,583 కోట్లు, గృహ రుణాలు రూ.328.50 కోట్లు, విద్యా రుణాలు రూ.53.25 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగం రూ.54.97 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాలు రూ.21.61 కోట్లు, ఎగుమతి రుణాలు రూ.12.80 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలు రూ.148.41 కోట్లు కేటా యించినట్లు పేర్కొన్నారు. ఎల్‌డీఎం ఉమాశంకర్ నందన, ఆర్బీఐ ప్రతినిధి యశ్వంత్ సాయి, నాబార్డ్ డీడీఎం జయప్రకాష్, ఎస్‌బీఐ ఏజీఎం కే.పద్మజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చత్రు నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తిరుపతిరావు, మెప్మా పీడీ స్వరూపా రాణి, డీఐసీ జీఎం సాల్మాన్ రాజు, అదనపు డీఆర్‌డీఓ రాకేష్ కుమార్ అధికారులు, బ్యాంకుల కంట్రోలర్లు, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభం: చల్మెడ



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** కాంగ్రెస్ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రజల్లో కౌంట్‌డౌన్ ప్రారంభమైందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం వేములవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో రైతులు సాగునీరు, విద్యుత్, యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పరిష్కారాన్ని గాలికి వదిలేసి వాహనాల్లో విహారయాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మల్కపేట రిజర్వాయర్‌లో ఒక్క టీఎంసీ నీటిని మాత్రమే నింపారని, మధ్యమానేరులో 24 టీఎంసీల నీరున్నా రైతులపై ప్రేమ ఉంటే ఎత్తిపోతల ద్వారా వేములవాడకు సాగునీరు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను ఒక్క యూనిట్‌గా చేసి యూరియా పంపిణీ చేస్తుండటంతో శత్రాజ్‌పల్లి రైతు ఒక బస్తా కోసం గంభీరావుపేట, వీర్నపల్లి, ముస్తాబాదు తిరిగి అష్టకష్టాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకోకుండా జిల్లాను యూనిట్‌గా చేయడం కాంగ్రెస్ దౌర్భాగ్య పాలనకు నిదర్శనమన్నారు. గడిచిన యాసంగిలో ధాన్యం కొనుగోలు సరిగ్గా చేయక రైతులను అరిగోస పెట్టారని విమర్శించారు. ఎమ్మెల్యే సొంత ఊరైన రుద్రంగిలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయని, ముందు తన ఊరి సంగతి చూసుకోవాలని ఆది శ్రీనివాస్‌కు హితవు పలికారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పేరుతో తిరిగిన విహారయాత్రలకు రూ.30 లక్షల స్వామివారి సొమ్ము దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, విమర్శించే స్థాయి ఆది శ్రీనివాస్‌కు లేదని, అభివృద్ధికి కేటీఆర్ తెచ్చిన మెడికల్ కాలేజీ, జేఎన్టీయూ, అపెరల్ పార్క్ కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు డ్రెస్సుల పంపిణీ



**ప్రజాపక్షం /ముస్తాబాద్:** ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మామిండ్ల భూపతి అధ్యక్షతన విద్యార్థులకు ఉచితంగా హౌస్ డ్రెస్సులను పంపిణీ చేశారు. పాఠశాలలోని నాలుగు హౌస్‌లకు చెందిన విద్యార్థులకు సుమారు రూ.80 వేల విలువైన 190 డ్రెస్‌లను పూర్వ విద్యార్థుల సౌజన్యంతో అందజేశారు. రెడ్, గ్రీన్, బ్లూ, ఎల్లో రంగుల్లో హౌస్ డ్రెస్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫిబ్రవరి 13న నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పూర్వ విద్యార్థులు పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించారు. ఆ నిధులతోనే విద్యార్థులకు హౌస్ డ్రెస్సులను అందించినట్లు తెలిపారు. అలాగే బాలుర పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు సంకల్ప సిద్ధి చారిటీ ఆధ్వర్యంలో, బాలికలకు ఏపీఎస్ చైర్మన్ వరి జ్యోతి–వెంకటేష్ సౌజన్యంతో ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ, ఎంఈఓ అంబటి రవీందర్, ఉపసర్పంచ్ కోల కృష్ణ, వార్డు సభ్యుడు జంగ రాజు, పెద్దిగారి శ్రీనివాస్, యూత్ లీడర్ వరి వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వినాయకా వీడ్కోలు




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో 11 రోజుల పాటు పూజలు అందుకున్న వినాయకుడుకి తుది రోజు ఘనంగా వీడ్కోలు పలికారు మండప నిర్వాహకులు. సాంప్రదాయ బద్ధంగా డోలు చప్పుల్లతో, గణపతి బప్ప మోరియా అంటూ వీధుల గుండా తిరుగుతూ స్థానిక గిద్ద చెరువులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా సహకరించిన పోలీసు సిబ్బందికి, విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది మళ్లీ రావయ్య గణపయ్య అంటూ నినదించారు.

# ఉద్యోగ విరమణ పొందనున్న జి.ఎంకు ఆత్మీయ సన్మానం



**ప్రజాపక్షం/రామగిరి :** గురువారం జి.ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ సవిత దంపతులను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ తిరుమల దంపతులు,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు వెంకట లక్ష్మి దంపతులు,ఏరియాలోని వివిధ గనుల,విభాగాధిపతులతో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎ.మనోహర్ సింగరేణి సంస్థలో 38 సంవత్సరాల పాటు వివిధ ఏరియాలలో, వివిధ గనులు, విభాగాలలో, వివిధ హోదాలలో విధేయతతో,అంకితభావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు.పలు సంస్కరణలు చేపట్టి ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు.ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం యం.రామ్మోహన్, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్,ఏరియా ఇంజినీర్లు ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫ్యాటింగ్,జె. రాజశేఖర్, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ,సి.జె.సురేఖ,బి.సుదర్శనం,రవి కుమార్, జి.లక్ష్మీ నారాయణ,అప్సర్ పాషా, కళ్యాణ్ చక్రవర్తి, షబ్బీరుద్దీన్, రాజారవిచరణ్,ఆర్.రాజేశ్వరి,ఆసిఫ్ యాసిన్, మేనేజర్లు రావుల పాపయ్య, భరత్ కుమార్,ఇతర అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

# మండల వార్డు మెంబర్స్ ఫోరం ఇంచార్జ్ నియమాకం




**ప్రజాపక్షం /ముస్తాబాద్:** తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరంను మండల స్థాయిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో, ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి, మండలాల ఇన్చార్జిలను నియమించాలని తెలపడంతో, ముస్తాబాద్ మండల వార్డు మెంబర్స్ ఫోరమ్ ఇంచార్జ్ గా చందన అంజయ్యను నియమిచ్చినట్లు తెలంగాణ వార్డు మెంబర్ల ఫోరం జిల్లా ఇంచార్జ్ కొమ్ము రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ,మండలంలోని వార్డు సభ్యులను సమన్వయం చేసుకుంటూ, వారి సమస్యల పరిష్కారం, హక్కులు, సంక్షేమం కోసం అంకితభావంతో పని చేస్తూ, తెలంగాణ వార్డు మెంబర్ల ఫోరంను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. మండల బాధ్యతను అప్పగించిన తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం వ్యవస్థాపకురాలు నాగబెల్లి జ్యోతి కి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జ్ కొమ్ము రాజశేఖర్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# అధికారుల ఉదాసీనతకు నిలువెత్తు సాక్ష్యం 'పోతారం'



**ప్రజాపక్షం/ముత్తారం :** అధికారుల ఉదాసీనతకు, ప్రభుత్వ నిర్లక్ష్యానికి పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పోతారం గ్రామం సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.గ్రామం నడిబొడ్డున వర్షం వస్తే చాలు చెరువు తలపిస్తూ సమస్య రోజురోజుకూ జటిలమవుతున్నా, పాలకులు గానీ, అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు.గ్రామ నడిబొడ్డున ఉన్న ఈ సమస్య కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షం వచ్చినప్పుడు రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోతుండటంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు,నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు ఎన్నోసార్లు మండల అధికారుల చుట్టూ, జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగి రాతపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. అయినా ఉన్నతాధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. అర్జీలు ఇచ్చి విసిగిపోయినప్పటికీ,సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో అధికారుల మొండి వైఖరిపై పోతారం గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి,పోతారం గ్రామస్తుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని,డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి రోడ్డు నిర్మించాలని గ్రామ ప్రజలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.

# రమేష్ మృతదేహానికి నివాళి మంత్రిరామగుండం ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ సిటీ కేబుల్ రిపోర్టర్, టీవీ 9 కెమెరామెన్ గా పనిచేస్తూ బుధవారం గుండెపోటుతో మరణించిన రమేష్ మృతదేహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు,రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ లు పూలమాలవేసి నివాళులు అర్పించారు.రమేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.రిపోర్టర్ గా రమేష్ గడిచిన 20 సంవత్సరాలుగా అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.రమేష్ మరణం తీరని లోటు అని అన్నారు.ఇలాంటి సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని మంత్రి లక్ష్మణ్ కుటుంబ సభ్యులను కోరారు.



# ముత్తారం మండలంలో ముగిసిన వినాయక నిమజనోత్సవాలు

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం వ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గత తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలందుకున్న గణనాథుల నిమర్జన వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.అయితే,మండలంలో కురిసిన భారీ వర్షం కారణంగా నిమర్జన కార్యక్రమాలకు కొంత అంతరాయం ఏర్పడింది.వర్షం ప్రభావంతో బుధవారం నాడే కొన్ని ప్రాంతాల్లోని గణపతి విగ్రహాలను నిమర్జనం చేయగా,మిగిలిన విగ్రహాలను గురువారం భక్తిశ్రద్ధలతో స్థానిక జలాశయాల్లో నిమర్జనం చేశారు.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు మంగళహారతులు,కోలాటాలు,డప్పు వాయిద్యాల నడుమ గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు.మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముత్తారం ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.నిమర్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



# విద్యకు ఇంటిగ్రేటెడ్ స్కూల్

**ప్రజాపక్షం /ముస్తాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ 200కోట్లతో సిరిసిల్ల లో ఏర్పాటు చేస్తున్నారని ఎస్ ఎస్ యూ ఐ రాష్ట్ర కార్యదర్శి మిగడొడ్డి భాను కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నే తృత్వంలో ప్రజా ప్రభుత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా 200 కోట్లతో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ సిరిసిల్లకి మంజూరు అయిందని తెలిపారు. ఈ నెల 30 తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్న నేపథ్యంలో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడం ప్రాధాన్యత సంతరించుకొంది. క్రీడా వసతులు వంటి మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది అన్నారు.

## మండల మైనార్టీ సంఘం అధ్యక్షుడిగా అమీన్



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మల్లాపూర్ మండల మైనార్టీ సంఘం కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించి అధ్యక్షుడిగా రాఘవపేట గ్రామానికి చెందిన మహమ్మద్ అమీన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలాగే మండల అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ,(ఫ్లిప్కార్ట్),గౌరవ సలహాదారునిగా మహమ్మద్ రఫీ మల్లాపూర్ లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. తనపై నమ్మకం ఉంచి తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న మండల మైనార్టీ సంఘ సభ్యులకు ఆమెన్,రఫీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీ సోదరులకు అందుబాటులో ఉండి ఎల్లవేళలా సేవలందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల మైనార్టీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీతోనే ప్రభుత్వ పథకాలకు అర్హత

### ధాన్యం కొనుగోలుకు డిజిటల్ పంట సర్వేలో వివరాల నమోదు

**ప్రజాపక్షం/ధర్మపురి :** రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకుని రైతు గుర్తింపు కార్డు పొందాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సూచించారు. సెప్టెంబర్ 30 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రీపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గురువారం పెద్ద నక్కల పేట, తిమ్మాపూర్, గోవిందుపల్లి, దొంతాపూర్ గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రత్యేక సదస్సులు నిర్వహించి రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం ఏడు రకాల సన్న వడ్లకు బోనస్ ప్రకటించిన నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు డిజిటల్ క్రాప్ సర్వే కీలకంగా మారిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో వాలంటీర్ల ద్వారా డిజిటల్ పంట సర్వే కొనసాగుతోందని, రైతులు తమ పంట వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు.ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు డిజిటల్ క్రాప్ సర్వే ఆధారంగా జరిగే అవకాశం ఉన్నందున ప్రతి రైతు తప్పనిసరిగా పంట వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీతో పాటు పంట నమోదును కూడా సెప్టెంబర్ 30లోగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.




# నెలలు నిండక పుట్టిన శిశువుకు ప్రత్యేక చికిత్స

### సూపరిండెంట్ కే . శ్రీధర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా మైదం బండ గ్రామానికి చెందిన గర్భిణీకి నెలలు నిండకముందే,ఎనిమిదవ నెలలో ప్రసవ నొప్పులు రావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం జరిగిందని,ముందస్తు ప్రసవం కావడంతో తక్కువ బరువుతో జన్మించిన మగ శిశువును మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రి తీసుకొని రాగాశిశువు 1 కిలో 500 గ్రాముల బరువుతో జన్మించడంతో పాటు, ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల పుట్టిన వెంటనే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. శిశువుకు తక్షణమే cpap పరికరం ద్వారా శ్వాస సహాయం అందిస్తూ ప్రత్యేక వైద్య చికిత్స ప్రారంభించడం జరిగిందని ఆసుపత్రి సూపరిండెంట్ కే శ్రీధర్ తెలిపారు. గురువారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు CPAP సహాయం అందించిన అనంతరం, పరిస్థితిని బట్టి నాసెల్ ప్రోన్ ద్వారా ఆక్సిజన్ అందించామని శిశువు ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడడంతో పాటు బరువు పెరగడం కోసం కె ఎం సి అందించగా తల్లిపాలను అవసరమైన విధంగా అందిస్తూ శిశువు పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నామని తెలిపారు. నెలలు నిండకముందే జన్మించడం మరియు తక్కువ బరువు కారణంగా తల్లిపాలు సరిగా జీర్ణం కాకపోవడంతో శిశువుకు ఇన్ఫెక్షన్ ఏర్పడి కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తాయనీ, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, శిశువుకు అవసరమైన మందులు, ఇంజెక్షన్లను అందుబాటులోకి తెప్పించి, సుమారు పది రోజుల పాటు ప్రత్యేక పర్యవేక్షణతో చికిత్స అందేలా చర్యలు తీసుకున్నామని, శిశువుకు 21 రోజుల పాటు నిరంతరం సేవలందించి, ఆరోగ్యవంతంగా డిశ్చార్జ్ అయ్యేలా కృషి చేసిన పీడియాట్రిక్ వైద్య బృందం,డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ రవీందర్,డాక్టర్ ప్రణీత్,డాక్టర్ ఉదయ్ కుమార్,డాక్టర్ సమత,డాక్టర్ రవి రాజా,డాక్టర్ అనుషా రెడ్డి లను మరియు నర్సింగ్ సిబ్బంది, సపోర్టింగ్ సిబ్బందిని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కే శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లిలో ముందస్తు ప్రసవాలు, తక్కువ బరువుతో జన్మించిన శిశువులకు అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి

### సిపి అంబర్ కిషోర్ ఝా



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా గురువారం తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు.ఎస్ఐ,స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు,కేసులు మరియు రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై ఆరా తీశారు.స్టేషన్ పరిధిలో తరచుగా నమోదవుతున్న నేరాలు,నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు,పరిధిలోని గ్రామాల పరిస్థితులు,శాంతిభద్రతల పరిస్థితి,పోలీస్ స్టేషన్ నిర్వహణ తదితర అంశాలపై ఎస్ఐను సీపీ అడిగి తెలుసుకున్నారు.5S విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,బాధితులు,ప్రజలకు అందించే పోలీస్ సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు.రౌడీషీటర్లు,సస్పెక్ట్ షీట్‌లో ఉన్న వ్యక్తులు,ఇతర నేరస్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ,వారి కదలికలు,కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.అనంతరం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సీపీ సందర్శించారు.కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి,మరిన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రాజీవ్ రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సంబంధిత ప్రభుత్వ శాఖలు,సంస్థలతో సమన్వయం చేసుకుంటూ రహదారి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేసి,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

## నాసిరకం పనులపై బిఆర్ఎస్ నాయకుల ఆగ్రహం



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణంలోని 12వ వార్డులో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ వారం రోజులకే కూలిపోవడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పార్టీ నాయకులు కూలిపోయిన డ్రైనేజీ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్‌కుమార్ లు మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులను ఆగమేఘాలపై చేపడుతూ నాసిరకం పనులతో ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపించారు. సుమారు ఏడాది క్రితం ఇదే వార్డులో డ్రైనేజీ నిర్మాణం కారణంగా ఓ నిరుపేద కుటుంబానికి చెందిన ఇల్లు కూలిపోయిన ఘటనను వారు గుర్తుచేశారు. ధర్మపురిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వయంగా సమీక్షించాలని డిమాండ్ చేశారు.ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో డ్రైనేజీ పనులు నెలల తరబడి కొనసాగుతున్నా రోడ్ల పునరుద్ధరణ జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 12వ వార్డులో డ్రైనేజీ కూలిపోవడంతో బురద, మురుగునీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అలాగే కాంట్రాక్టర్ల పనులకు మున్సిపాలిటీకి చెందిన జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ వంటి వాహనాలను వినియోగిస్తున్నారని నాయకులు ఆరోపించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షంగా సహకరిస్తామని, అయితే నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ప్రశ్నిస్తామని తెలిపారు. 12వ వార్డులో కూలిపోయిన డ్రైనేజీని నాణ్యతా ప్రమాణాలతో వెంటనే పునర్నిర్మించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, సీనియర్ నాయకులు ఒడ్నాల మల్లేశం, సంగి శేఖర్, చిలువేరి శ్యామ్‌సుందర్, చీర్నెని నర్సయ్య, బండారి అశోక్,చుక్క రవి,తరాల కార్తీక్, అనంతుల లక్ష్మణ్,జెట్టి రాజన్న,ఎస్.డి.ఆసిఫ్,నక్క రాజేందర్,ముత్తినేని లక్ష్మణ్,పాల్గొన్నారు.

## టాస్ ఓపెన్ ప్రవేశాలకై విస్తృత ప్రచారం



**ప్రజాపక్షం/ఎండపెల్లి :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా అందిస్తున్న ఓపెన్ పదో తరగతి,ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం గుల్లకోట గ్రామంలో ఉపాధ్యాయులు గురువారం విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు.గుల్లకోట పాఠశాల పరిధిలో ఓపెన్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను పాఠశాల హెచ్ఎం మునీందర్, కోఆర్డినేటర్ శనిగరపు రవి విడుదల చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మునీందర్ మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల చదువుకు దూరమైన వారు,డ్రాపౌట్స్ టాస్ అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ విద్యను కొనసాగించాలని కోరారు.అనంతరం గుల్లకోట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గొల్లపల్లి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో ఓపెన్ ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించి,గోడలపై అతికించారు. గ్రామంలోని ప్రజలకు, యువతకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రవేశాల అర్హతలు, దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సర్పంచ్ సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కుమార్,అరిగెల రవి,వెంకటేష్,పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## కట్టిన వారానికే కూలిన డ్రైనేజీ కాల్వ



**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపెల్లి ఓర్రెలో ఇటీవల నిర్మించిన డ్రైనేజీ రక్షణ గోడ (సిమెంట్ కాల్వ) వారం రోజులకే దెబ్బతిని కూలిపోవడంపై బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సుంకపాక టైటస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.స్వల్ప వర్షానికే కాల్వ గోడలు బీటలు వారడంతో నిర్మాణ పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.నాణ్యత ప్రమాణ ల ప్రకారం సిమెంట్–ఇసుక మిశ్రమాన్ని వినియోగించకపోవడం వల్లే గోడలు కూలిపోయాయని ఆరోపించారు.పనులు పూర్తయిన ఏడు రోజులకే ఈ పరిస్థితి తలెత్తడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని స్పష్టం చేస్తోందన్నారు.నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన మండల స్థాయి ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహించారని టైటస్ ఆరోపించారు.నాసిరకం పనులతో ప్రజాధనం వృథా అవుతోందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే కాల్వ నిర్మాణంపై సాంకేతిక విచారణ చేపట్టి, నాణ్యతను పరిశీలించాలని డిమాండ్ చేశారు.బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## మోడల్ స్కూల్‌లో ఉచిత కంటి వైద్య పరీక్షలు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జిల్లా అంధత్వ నివారణ మరియు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్ బి ఎస్ కె) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరంలో పాఠశాలకు చెందిన దాదాపు 502 మంది విద్యార్థులకు వైద్య బృందం క్షుణ్ణంగా కంటి పరీక్షలు నిర్వహించారు.వీరిలో దృష్టి లోపంతో బాధపడుతున్న 24 మంది విద్యార్థులను ప్రాథమికంగా గుర్తించారు. దృష్టి లోపం ఉన్నట్లు తేలిన ఈ విద్యార్థులకు త్వరలోనే జిల్లా అంధత్వ నివారణ సమితి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు వైద్య అధికారులు తెలిపారు.ఈ ఉచిత కంటి వైద్య పరీక్షల కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు డాక్టర్ స్వాతి, నేత్రాధికారి కె. తిరుపతి,ఫార్మసిస్ట్ శ్రీలత,పాఠశాల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం కీలకం



**ప్రజాపక్షం / మంచిర్యాల టౌన్ :** చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం, పరిశుభ్రత ఎంతో కీలకమని సూపర్ వైజర్ జ్యోతి పేర్కొన్నారు. పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా రామనగర్ సెక్టార్ పరిధిలోని రామనగర్3 అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషకాహారం, శిశు సంరక్షణ పద్ధతులపై క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, పిల్లలకు సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీలో తల్లులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని సమాధానాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సబిత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ రాజన్నను పరామర్శించిన కోనప్ప



**ప్రజాపక్షం / పెంచికల్ పేట్ :** అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని ఎల్లూర్ గ్రామ మాజీ సర్పంచ్ దుర్గం రాజన్నను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం పరామర్శించారు. రాజన్న అనారోగ్యంతో మెడి లైఫ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన నేరుగా ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడొద్దని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## నివేదికలతోనే సమావేశాలకు హాజరు

**ప్రజాపక్షం / కౌటాల :** మండల ప్రజా పరిషత్ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం కౌటాల ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ కోట ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు గైర్హాజరు కావడం, నివేదికలు ఇవ్వకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పనులు చేసినా నెలల తరబడి బిల్లులు రావడం లేదని, దీనివల్ల కొత్త పనులు చేపట్టలేకపోతున్నామని పలువురు సర్పంచులు సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయానికి కొత్త భవనం మంజూరు చేయాలని డిసిఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య కోరగా, త్వరలోనే చర్యలు తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధలు దేవయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగవు




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుపై కొందరు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు సమంజసం కావని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల నాయకులు కొనగంటి ప్రశాంత్, అంగడి రాజేష్, అటకపురం సతీష్ పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సురిమిల్లి వేణు, సుధమల్ల అశోక్‌తేజ ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. సాధారణ కార్యకర్తగా ఉన్న సమయంలో రాజకీయంగా ప్రోత్సహించి, ఇచ్చిన మాట ప్రకారం 2023లో మున్సిపల్ చైర్మన్ పదవి దక్కేలా సహకరించిన ఎమ్మెల్యేపైనే ఇప్పుడు విమర్శలు చేయడం తగదన్నారు. రాజకీయ విభేదాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో తెలపాలని, వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ దళిత కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అంటేనే కరెంట్ కోతలు

### బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



**ప్రజాపక్షం / జైపూర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కరెంట్ కోతలు మొదలయ్యాయని, ఎస్‌టిపిపిలో 45 లక్షల టన్నుల బొగ్గు ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ డిమాండ్ చేశారు. జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని (ఎస్‌టిపిపి) ఆయనతో పాటు మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య తదితరులు గురువారం సందర్శించారు. మొదట అధికారులు అనుమతి లేదంటూ నిరాకరించినా చివరకు లోపలికి వెళ్లడానికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు యూనిట్లలో కలిపి రోజుకు వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యేదని, ప్రస్తుతం ఒకే యూనిట్ ద్వారా కేవలం 400 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. మూడో యూనిట్ పనులను వేగవంతం చేయడం లేదని, మరోవైపు అధికారులు ఉద్యోగాలు అమ్ముకుంటూ స్థానిక నిర్వాసితులు, నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ సాగునీరు, తాగునీరు, విత్తనాలు, ఎరువులు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ అంటేనే దోపిడీ దొంగల రాజ్యమని, రానున్న రోజుల్లో ఆ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా



**ప్రజాపక్షం / పెంచికల్ పేట్ :** అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసానిస్తుందని బిజెపి నాయకులు బోయిరే నానయ్య, కడంబా శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంచికల్ పేట్ మండలం చేడ్వాయి గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను గురువారం వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామానికి చెందిన లోకండి రావుజీకి రూ.19వేలు, పొట్టే రామాంజనేయులుకు రూ.33వేలు, ముజం రాజేశ్వరికి రూ.43వేల చొప్పున ఆర్థిక సహాయం అందినట్లు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ పథకాల ద్వారా అండగా నిలవడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మహేష్, సాయిరి సాయికిరణ్, బండ సాయి పాల్గొన్నారు.

# పోతుగంటి పోశెట్టి 'నివాళి గీతం' ఆవిష్కరణ




**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట వీరుడు పోతుగంటి పోశెట్టి నివాళి గీతాన్ని గురువారం స్థానిక సిపిఐ పట్టణ కార్యాలయంలో ఆవిష్కరించారు. పోశెట్టి 45వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుమారుడు పోతుగంటి అశోక్, సిపిఐ నాయకులు మిట్టపల్లి వెంకటస్వామి, ఆడెపు రాజమౌళి గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మా ట్లాడుతూ బెల్లంపల్లిలో కమ్యూనిస్టు పార్టీకి బలమైన పునాది వేయడంలో పోశెట్టి కీలక పాత్ర పోషించారని తెలిపారు. నాయకులను తీర్చిదిద్ది పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజాప్రతినిధిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని కొనియాడారు. పోశెట్టి పోరాట జీవితం, ప్రజాసేవ భావితరాలకు అందించేందుకే ఈ గీతాన్ని రూపొందించినట్లు రచయిత, ఆయన మనవడు పోతుగంటి భరత్ రుషి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లం తిలక్ అంబేద్కర్, కొండు బానేష్, గుండా చంద్రమాణిక్యం, అక్కేపల్లి బాపు, దాసరి తిరుపతిగౌడ్, బొంకురి రామచందర్, స్వామిదాస్, ఇనుముల రాయమల్లు పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



**ప్రజాపక్షం / జన్నారం :** గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ కవిత సూచించారు. మండల కేంద్రంలోని చెరుకుగూడ అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని తెలిపారు. అనంతరం ముర్రుపాల ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కృష్ణవేణి, సవిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థినికి ప్రోత్సాహకం




**ప్రజాపక్షం / కౌటాల :** పదో తరగతిలో 550 మార్కులు సాధించి జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిన ముత్తంపేట్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని చిలువేరి లావణ్యకు శ్రీరామ్ గ్రూప్ రూ.లక్ష ప్రోత్సాహక నగదు అందజేసింది. హైదరాబాద్‌లో గవర్నర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా ఆమె చెక్కును అందుకుంది. ఈ సందర్భంగా లావణ్యను ఎంఈఓ నానాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గావుడే హన్మంతు, ఉపాధ్యాయులు అభినందించారు. లావణ్య కృషితో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఈ విజయానికి కారణమని వారు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## అనుమతుల్లేని ఫంక్షన్ హాల్‌పై విచారణ చేపట్టాలి



**ప్రజాపక్షం / వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రహ్లాద్ ముండే ఫంక్షన్ హాల్‌పై సమగ్ర విచారణ జరపాలని మండోకర్ అనిల్ గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫంక్షన్ హాల్ నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన లేఅవుట్, డిటిసిపి అనుమతులు ఉన్నాయా లేదా తేల్చాలని సర్పంచ్ సతీష్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను గురువారం కోరారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ గతంలో సదరు ఫంక్షన్ హాల్‌కు అధికారులు రెండుసార్లు నోటీసులు జారీ చేసినా తదుపరి చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. పంచాయతీ, ఇతర శాఖల అనుమతులు లేకుండా విద్యుత్ కనెక్షన్ ఎలా మంజూరు చేశారో విచారించాలని, రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారి పక్కన పార్కింగ్, రాకపోకలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :** మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని చెడ్వాయి, ఎల్కపల్లి గ్రామాల్లో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తన వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో వ్యవసాయ సంబంధిత సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. నమోదు చేసుకోని రైతులు పంట విక్రయం, ఎరువుల కొనుగోలు సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని హెచ్చరించారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా రైతులు వెంటనే రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు సకాలంలో అందేందుకు ఈ నమోదు ఎంతో కీలకమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రాంచందర్, చౌదరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నానాజీ, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీవిద్య, వెంకటేష్, వంశీ పాల్గొన్నారు.

## ఆంగ్ల విభాగాధిపతిగా సత్యనారాయణ



**ప్రజాపక్షం / జన్నారం :** వరంగల్ లోని ప్రముఖ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆంగ్ల విభాగాధిపతిగా జన్నారం మండలం అక్కపెల్లిగూడకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జూల సత్యనారాయణ నియమితులయ్యారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ కళాశాల వందేళ్ల శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న వేళ బాధ్యతలు చేపట్టడం ఎంతో గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో ఉన్నత విద్యకు నెలవుగా ఉన్న ఈ కళాశాలలో మాజీ ప్రధాన మంత్రి పివి నరసింహారావు, ప్రొఫెసర్ జయశంకర్ వంటి ఎంతో మంది ప్రముఖులు విద్యనభ్యసించారని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఉపకులపతి, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

# గంగమ్మ ఒడిలోకి ఏకదంతుడు

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలోని తొమ్మిది రోజులపాటు ఏకదంతుడు ప్రత్యేక పూజలు అందుకొని గంగమ్మ ఒడిలోకి చేరాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు ఘనంగా భక్తిశ్రద్ధలతో పూజలు,కీర్తనలు,భజనలు ఆలయాల్లో, వార్డుల్లో నిర్వహించి అన్నప్రసాదాలు చేశారు. భక్తులు తమ తమ మొక్కులు చెల్లించుకుని పాడి పంటలు బా గా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని వ్యాపారాలు అభివృద్ధి చెందాలని ఆ గణనాథునికి వేడుకున్నారు.అలాగే యువకులు భక్తి భజనలతో డీజే పాటలతో నృత్యలతో అలరించారు.

# మోక్ష గణపతికి ఘనమైన ఊరేగింపు

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలోని మోక్ష కర్ర గణపతి కి 11 రోజులు పూజలు అందుకొని ఘనమైన ఊరేగింపు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మోక్ష గణపతికి 11 రోజులపాటు ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు అన్నదానాలు నిర్వహించడం జరిగిందని, జిల్లా ప్రజలే కాకుండా ఆయా జిల్లాలతో పాటు,మహారాష్ట్ర నుండి భక్తులు వచ్చి తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పాడి పంటలు బాగా పండాలని వ్యాపారాలు వృద్ధి చెందాలని అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతున్ని వేడుకోవడం జరిగిందని తెలిపారు. అ లాగే నిమజ్జనంలో భాజా భజంత్రీలతో, మంగళ వాయిద్యాలతో మోక్ష గణపతిని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆరోగ్య శిబిరం

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** మండలంలోని ఆలూరు గ్రామంలో గురువారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఉచిత జ్వర నిర్ధారణ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 87 మందికి వివిధ ఆరోగ్య సమస్యలకు ఆరోగ్య సిబ్బంది మందులు అందజేశారు.గ్రామ సర్పంచ్ ఇర్ల చిన్నయ్య,వైద్యాధికారి అబ్దుల్ జవాద్, పర్యవేక్షకులు కృష్ణ మోహన్ గౌడ్,ఉపకేంద్ర సిబ్బంది రాజేందర్, నుస్రత్, ఆశా కార్యకర్తలు శ్యామల, రాజమణి, ప్రమీల పాల్గొన్నారు.

# ఎస్‌పితో మున్సిపల్ చైర్మన్ భేటీ

**ప్రజాపక్షం/భైంసా :** జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిలని భైంసా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా భైంసా పట్టణంలో నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో విజయవంతంగా ముగియడంతో ఎస్పీ డా.జానకీ షర్మిలకి చైర్మన్ తూమొల్ల దత్తాత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అందించిన సహకారం, భద్రతా ఏర్పాట్లను అభినందిస్తూ ఎస్పీని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు,తదితరులు పాల్గొన్నారు.

# యుపిఐపై వ్యాపారి రుసుము విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

## సిపిఐ బోథ్ మండల కార్యదర్శి ఎల్. నరేష్



**ప్రజాపక్షం/బోథ్ :** దేశంలో సామాన్య ప్రజలు, యువత, విద్యార్థులు,కార్మికులు,చిన్న వ్యాపారుల రోజువారీ జీవితంలో భాగమైన యుపిఐపై కొత్తగా వ్యాపారి రుసుము విధించే విధానాన్ని సిపిఐ బోథ్ మండల సమితి తీవ్రంగావ్యతిరేకిస్తోందని సిపిఐ బోథ్ మండల కార్యదర్శి ఎల్.నరేష్ తెలిపారు. యుపిఐ చెల్లింపులపై రుసుముల విధానాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రూ.2,000కు మించిన వ్యక్తి—వ్యాపారి లావాదేవీలపై 0–4 శాతం వరకు వ్యాపారి రుసుము,రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువలావాదేవీలపై ఒక్కో లావాదేవీకి గరిష్టంగా రూ.2,000 వరకు రుసుము విధించే ప్రతిపాదనలు చిన్న వ్యాపారులు, స్వ యం ఉపాధి పొందుతున్న యువతపై భవిష్యత్తులో ఆర్థిక భారాన్ని మోపే అవకాశం ఉందన్నారు.ప్రభుత్వం చెబుతున్న ప్రకారం మొత్తం వ్యాపారి లావాదేవీల్లో సుమారు 96 శాతం ఈ విధానం వల్ల ప్రభావితం కావని పేర్కొంటున్నప్పటికీ, మిగిలిన లావాదేవీలపై రుసుము విధించే విధానం ప్రజా ప్రయోజనాల దృష్టితో పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. యూపీఐ ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటైన డిజిటల్ ప్రజా మౌలిక వసతి అని, అది భవిష్యత్తులో రుసుముల విస్తరణకు మార్గంగా మారకూడదని అన్నారు. యూపీఐ అనువర్తనాలు అదనపు దాచిన రుసుములు విధించకుండా స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలని, ప్రజల డిజిటల్ చెల్లింపులు ప్రజల ప్రయోజనాల కోసమే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎల్. నరేష్ పిలుపునిచ్చారు.“రుసుముల వారానికి కాదు — ప్రజల ప్రయోజనాలకే డిజిటల్ చెల్లింపులు” అనే నినాదంతో పారదర్శకమైన,అందరికీఅందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపు వ్యవస్థ కోసం ప్రజా చర్చను ముందుకు తీసుకెళ్లాలని సి.పి.ఐ.బోథ్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్.నరేష్ అన్నారు.

# జిడిసి భైంసాలో ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/భైంసా :** భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల,లోఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. కె. రఘునాథ్ అధ్యక్షత వహించారు.ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు సేవాభావం,సామాజిక బాధ్యత, పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులు,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కలిసి కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కె.రఘునాథ్ మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లలో క్రమశిక్షణ,సేవాభావం,నాయకత్వ లక్షణాలు, బాధ్యత,సహనం, సమయపాలన, సహకార స్ఫూర్తి వంటి మంచి లక్షణాలు ఉండాలని సూచించారు. విద్యార్థులు సమాజ సేవలో చురుకుగా పాల్గొంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని అన్నారు.జిల్లా కన్వీనర్,డా.ఓంప్రకాశ్ ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యత,దాని లక్ష్యాలు, సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ పాత్రను వివరించారు.ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం,సామాజిక బాధ్యత,మానవతా విలువలు పెంపొందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డా. జె. భీమారావు,డా. పవన్ కుమార్,డా. ఎం. శంకర్,డా. కల్పన,శ్రీమతి దివ్య,తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# కొరడి గణనాథుడిని దర్శించుకున్న నేతలు



**ప్రజాపక్షం/భైంసా :** భైంసా మండలంలోని మాటెగావ్–కొరడి శ్రీ గణనాథుడిని మాజీ దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి,మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయంలో నిర్వహించిన హారతి కార్యక్రమంలో ఇద్దరు నాయకులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక హారతి సమర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ కొరడి గణనాథుడు భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్నారని, స్వామివారిని దర్శించుకునేందుకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని అన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగర్ భాయి, శ్రీనివాస్ రెడ్డి,సారంగాపూర్ మాజీ ఎంపీపీ మహేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ మహిపాల్,మాజీ ఆత్మ చైర్మన్ పోత రెడ్డి,మాజీ సర్పంచ్ లక్ష్మ ణ్ ,ఆలయ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు

## విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/దిలావర్ పూర్ :** దిలావర్‌పూర్ మండల పరిధిలోని బన్సపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో, నాబార్డ్ ఆర్థిక సహకారంతో, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయంతో రైతులకు విత్తనోత్పత్తిపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్యాక్స్ చైర్మన్ రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త కె. రాహుల్ విశ్వకర్మ,వ్యవసాయ శాఖ ఏడీఏ రాజశేఖర్ రెడ్డి, ముధోల్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎ. దినేష్ కుమార్ మరియు పలువురు ఆదర్శ రైతులు పాల్గొన్నారు. సమన్వయకర్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ, నాబార్డ్ సహకారంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు విజయవంతంగా కొనసాగుతోందన్నారు. బన్సపల్లికి చెందిన రైతు గంగిరెడ్డి పొలంలో సాగు చేస్తున్న ‘కూనారం 1638’ వరి రకం విత్తనోత్పత్తి క్షేత్రాన్ని ప్రస్తావిస్తూ,నాణ్యమైన విత్తనం కోసం పాటించాల్సిన వేర్పాటు దూరం,పంట పరిశుభ్రత, మరియు కల్తీల ఏరివేత వంటి సాంకేతిక అంశాలను రైతులకు వివరించారు. ప్యాక్స్ చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ, రైతులు స్వయంగా నాణ్యమైన విత్తనోత్పత్తి చేపట్టడం ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. రైతు నుంచి రైతుకే విత్తనం అనే విధానంతో ప్రతి ఒక్కరికీ తక్కువ ఖర్చులోనే మేలైన వి త్తనం అందుబాటులోకి వస్తుందని పేర్కొంటూ, నాబార్డ్ మరియు వ్యవసాయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.వ్యవసాయ సహసంచాలకులు రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే రబీ సీజన్‌లో రైతులు సాగు ప్రణాళికపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు ము ఖ్యంగా ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని,ఆరుతడి పంటల సాగుతోనే నీటి కొరతను అధిగమించి లాభదాయక దిగుబడులు సాధించవచ్చని స్పష్టం చేశారు.

# ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం




**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లకు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా డాన్స్ , సాంగ్స్,ఉపన్యాస పోటీలను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆనందం ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ క్యాతం సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సేవా భావాన్ని కలిగి ఉండి సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని, దేశ సేవకు అంకిత భావంతో పని చేయాలని, మానవ సేవయే మాధవ సేవ అనే ధర్మాన్ని అనుసరించి విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీ క్యాతం సంతోష్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆనందం,ప్రోగ్రామ్ ఆఫీసర్ క్యాతం సంతోష్ రెడ్డి, అధ్యాపకులు శ్రీదేవి, రాజేశ్వర్, హమీద్, రవిందర్, నాజ్నీన్, ఉమేరా, బాపు, నాగ రాజు, నరహరి, శ్రీనివాస్,రఘువీర్, అజయ్, రమేష్, సత్యనారాయణ, జాకబ్, సుభాష్, మంజూర్ వాలంటీర్లు,తదితరులు పాల్గొన్నారు.

# తానూర్ మండల సర్వసభ్య సమావేశం




**ప్రజాపక్షం/తానూర్ :** తానూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అధ్యక్షతన మండల ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ముందుగా ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారులకు గ్రామాల వారీగా స్థానిక సర్పంచులు ఆధ్వర్యంలో పట్టాలను అందజేశారు.అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.గత సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు తీసుకెళ్లిన సమస్యలకు పరిష్కారం చూపలేదని,సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రత్యేక సమావేశాలు ఎందుకని ప్రత్యేక అధికారి అధికారులను నిలదీశారు.పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీధర్, ఎంపీవో అమీర్ ఖాన్, వ్యవసాయశాఖ అధికారి మనీషా, ద్యాధికారి నరేందర్,డిప్యూటీ తహసీల్దార్ రవీందర్,ఏపీఎం సులోచన, ఏపీవో శివలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ‘ఆత్యపాత్య’ పోటీలకు నిర్మల్ జిల్లా జట్ల ఎంపిక



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా ఆత్యపాత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సీనియర్ పురుషులు, మహిళల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 11, 12, 13 తేదీల్లో జగిత్యాల జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఆత్యపాత్య పోటీల్లో నిర్మల్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్,దీక్ష కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మ ణ్, ఎస్జీఎఫ్ సెక్రెటరీ లక్ష్మ ణ్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి సామ్యుయెల్, ఆత్యపాత్య అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వన్నెల భూమన్న హాజరై మాట్లాడారు. గ్రామీణ క్రీడ అయిన ఆత్యపాత్యలో నిర్మల్ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టిజిపేట కార్యదర్శి, ఆత్యపాత్య అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సంజీవ్, టిజిపేట కోశాధికారి నచ్చేందర్, బిజెపిపేట సంయుక్త కార్యదర్శి పోశెట్టి, ఆత్యపాత్య కోశాధికారి శ్రీనివాస్, ప్రతినిధులు భూమేష్, గిరి, హనుమాన్లు, సాయిరాజ్, ముఖేష్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను హెచ్ఎం పద్మ, ఉప సర్పంచ్ గులాబ్ సింగ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. క్రీడాకారులు ప్రతిభ చాటి జిల్లాకు, పాఠశాలలకు పేరు తీసుకురావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సంతోష్ సింగ్, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రణాళికతో సాగాలి

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని సింగరేణి డైరెక్టర్ పిపి కె. వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం ఉపరితల గనిని ఆయన సందర్శించి ఉత్పత్తి, ఉత్పాదకత తీరుతెన్నులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇందారం ఉపరితల గనికి నిర్దేశించిన 15 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడంతో పాటు అధిగమించే దిశగా అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గనికి అవసరమైన యంత్రాలు, పరికరాలను సమకూర్చుకుని పనులకు ఆటంకం లేకుండా చూడాలని, రక్షణతో కూడిన ఉత్పత్తికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సమక్షంలో గని ప్రణాళికలను, పని ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గని ప్రాజెక్టు అధికారి ఎవి.రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీరు రామకృష్ణ, నిర్వహణ అధికారి శంకర్, రక్షణ అధికారి మహేష్, భూసర్వేయర్ శ్రీను పాల్గొన్నారు.

## వినాయకుని సన్నిధిలో కలెక్టర్ పూజలు



**ప్రజాపక్షం/తానూర్ :** తానూరు మండలం బోసి గ్రామంలో ప్రసిద్ధ కర్ర వినాయకుని ఆలయాన్ని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం సందర్శించారు.స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు అర్చకులు,గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఉత్తం బాలేరావ్, స్థానిక సర్పంచ్ సాగర్‌బాయి నాగనాథ్,ఉప సర్పంచ్ లక్ష్మ ణ్, గ్రామ కమిటీ, సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. శివాలయ ప్రాంగణంలోని వినాయకునితో పాటు పరమశివునికి కూడా అభిషేకం, అర్చన నిర్వహించారు.పూజల అనంతరం ఆలయ కమిటీ వారు కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా,భక్తిభావంతో జరుగుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ పండుగలను ఐక్యతతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంట భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,తానూర్ తాసిల్దార్ మహేందర్ నాథ్,ఆర్ఐ నరేష్, సంబంధిత అధికారులు,గ్రామ ప్రజలు ఉన్నారు.

## బడిబాట బురదమయం..విద్యార్థుల అవస్థలు



**ప్రజాపక్షం / చెన్నూరు :** ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకోవాలని అధికారులు, పాలకులు చెప్పడమే తప్ప వసతుల కల్పనలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. చెన్నూరు పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం దారి బురదమయమై చిత్తడి వలయంగా మారడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 400 మంది విద్యార్థినులు చదువుకుంటున్న ఈ పాఠశాలకు ఇరువైపులా ఉన్న మార్గం వర్షపు నీటితో బురదమయంగా మారింది. నిత్యం కాలినడకన వచ్చే విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు నడవలేక జారిపడుతున్నారు. బురద కారణంగా నడిచే వీలు లేకపోవడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సమీపంలోనే నాలుగేళ్లుగా మినీ స్టేడియం నిర్మాణంతో పాటు పలు నివాసాలు ఏర్పడుతున్నాయి. స్థానిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ పలుమార్లు ఈ ప్రాంతానికి వచ్చి బురదలోనే పాఠశాల, స్టేడియం పనులను పరిశీలించినా రోడ్డు ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. పాలకులు, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి వెంటనే పక్కా రోడ్డు సౌకర్యం కల్పించి బాలికల రాకపోకల కష్టాలను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

## పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు

కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** వినాయక నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా సాగేలా నిమజ్జన ప్రదేశాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గోడవెల్లి వాగు వద్ద నిమజ్జన ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విగ్రహాలను తీసుకువచ్చే మార్గంలో వర్షాల వల్ల ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని సూచించారు. నిమజ్జనం జరిగే ప్రదేశం వద్ద సరిపడా విద్యుత్ దీపాలు, అవసరమైతే జనరేటర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. వాగు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిపుణులైన గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారి లోకేశ్వర్ రావు, తహసిల్దార్ రియాజ్ అలీ, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మెంగ్రే ఆకాష్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూముల రీ సర్వే ప్రక్రియపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు పూర్తయిన రీ సర్వే వివరాలు,పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 16 సర్వే యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ,16 ప్రత్యేక బృందాల ద్వారా సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రతి సర్వే బృందంలోని సిబ్బంది సమన్వయంతో, నిర్దేశిత విధానాలను పాటిస్తూ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. భూమి యజమాని, సరిహద్దు భూముల రైతుల సమక్షంలో సర్వే నిర్వహించి,ఎటువంటి వివాదాలకు తావులేకుండా ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే నిర్వహించే తేదీ, సమయానికి సంబంధించిన సమాచారాన్ని ముందుగానే సంబంధిత రైతులకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఏ.డీ.ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్, సంబంధిత అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారాలతో సమస్యలు పరిష్కారం కావు



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** ప్రభుత్వ వైఫల్యాలు, అధికారుల నిర్లక్ష్యాలను కప్పిపుచ్చుకోవడానికి అందించే కంటితుడుపు నష్టపరిహారాలతో సమస్యలు పరిష్కారం కావని జనసేన జిల్లా అధ్యక్షుడు తన్నీరు మధుకర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి సైదాల్ శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ రిమ్స్ ప్రత్యేక నవజాత శిశువుల విభాగంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్, ఏసి పేలి సంభవించిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన చిన్నారుల సంఖ్య ఐదుకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన వారు, ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల పరిహారంతో ఆ కుటుంబాల కన్నీటిని తీర్చలేరని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పాలనలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్చార్జి మంథని సంపత్, నాయకులు చుచ్చు రాజకిరణ్, ఆవునూరి రమేష్, హరి ప్రసాద్, ఆవుల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మంటపంలో పూజలు



**ప్రజాపక్షం/మావల:** మావల ఈశ్వర్ గణేష్ మండలిలో నిర్వహించిన నిమజ్జన ఉత్తర పూజలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ఏఎంసి చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. సాంప్రదాయ డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికిన మండలి సభ్యులు, అనంతరం అతిథులను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కమీషన్ల కోసం ప్రజల ప్రాణాలతో ఆడుకుంటారా?

**ప్రజాపక్షం/డిచ్‌పల్లి:** కమీషన్ల కోసం ప్రజల ప్రాణాలతో ఆడుకుంటారా..? అని సుద్దపల్లి గ్రామస్తుడు సతీష్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం సుద్దపల్లికి చెందిన పలువురు గ్రామస్తులు, నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుద్దపల్లి శివారులో బ్లాక్ స్పాట్ ఉండటం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎంతోమంది ప్రాణాలు సైతం కోల్పోయారన్నారు. బిజెపి ఎంపి అరవింద్ కృషితో చేసిన ప్లైఓవర్ బ్రిడ్జి మంజూరు అయి కూడ ఆరు నెలలు అవుతుందన్నారు. కానీ కొంతమంది నాయకులు కమీషన్ల కోసం రోడ్డు పనులను అడ్డుకుంటున్నట్లు తెలిసిందన్నారు. ప్రజల ప్రాణాలు పోతున్న ఇక్కడ కమీషన్ల కోసం పాకులాడటం సిగ్గుచేటన్నారు. ఇకనైనా ఈ పనులు అయ్యేలా చూడాలని లేనిచో కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉప సర్పంచ్ క్రాంతి కుమార్ , మోహన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని దేబికాకు పురస్కారం



**ప్రజాపక్షం / వాంకిడి :** పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా టాపర్‌గా నిలిచిన ఇంధాని జెడ్పి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని బిశ్వాస్ దేబికాకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా రూ.2 లక్షల నగదు పురస్కారం అందింది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆడిటోరియంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ గురువారం నిర్వహించిన 'చదువుకో తెలంగాణ' కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 560 మార్కులు సాధించిన దేబికా కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా టాపర్‌గా నిలవడంతో సంస్థ నగదు బహుమతిని అందజేసి సత్కరించింది.జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థినిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, ఎంఇఒ శివచరణ్ కుమార్, ఉపాధ్యాయులు మహేష్, శ్రీనివాస్, ప్రేమ్‌సింగ్, పద్మ, దయారాం, జమీల్, విజయ్, సరస్వతి, సిఆర్‌పి దుర్గం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విశాల్ ఎంపిక

**ప్రజాపక్షం / జన్నారం :** మండల కేంద్రంలోని రాఘవేంద్ర లిటిల్ హార్ట్స్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాదావత్ విశాల్ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో గురువారం విశాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎదులాపురం శ్రీనివాస్, డీన్ హేమలత షిండే మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విశాల్ ఎంపికపై రాఘవేంద్ర గ్రూప్స్ చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్, కరస్పాండెంట్ ఎర్ర సంపత్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఎల్ఇపి అమలు తీరుపై పరిశీలన

**ప్రజాపక్షం / కౌటాల :** జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్ఎల్ఇపి) సేవలను మరింత సమర్థవంతంగా కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర పరిశీలక బృందం సభ్యులు డాక్టర్ వీర కుమార్, డాక్టర్ జాన్ బాబు సూచించారు. గురువారం కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల బృందం సందర్శించి కార్యక్రమం అమలు తీరును పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓపి సేవలు, రోగుల రికార్డులు, ఎండిటి మందుల నిల్వలను అధికారులు తనిఖీ చేశారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు అందుతున్న చికిత్స, వైకల్య నివారణ చర్యలు, చికిత్స అనంతర పర్యవేక్షణ, ప్రజల్లో చేపడుతున్న అవగాహన కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు క్షేత్రస్థాయిలో బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎన్ఎల్ఇపి బృందం సభ్యులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఉత్సవాలు

సర్పంచ్ కాసం రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదర్శంగా నిలిచిన లక్ష్మీపూర్ ఎడ్లబండి శోభాయాత్రతో పాతకాలపు సంస్కృతికి పునర్జీవం





**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సరికొత్త ఆదర్శాన్ని చాటింది.పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ సంస్కృతి–సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఈ ఏడాది గణనాథుని ఉత్సవాలను అత్యంత వైభవంగా, ప్రత్యేకంగా నిర్వహించారు.లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద వినాయక మండపాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి పూజలు నిర్వహించారు.ఈ ఉత్సవాల నిర్వహణ బాధ్యతలను గ్రామ సర్పంచ్ కాసం రాజశేఖర్ దగ్గరుండి పర్యవేక్షించారు.పర్యావరణానికి హాని కలిగించకుండా ఉండేదుకు ఈ ఏడాది గ్రామమంతటా కేవలం మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించేలా గ్రామస్తులను ప్రోత్సహించి, లక్ష్మీపూర్ గ్రామాన్ని జిల్లాలోనే ప్రత్యేకంగా నిలిపారు. సంప్రదాయ శోభాయాత్ర:కేవలం ప్రతిష్ఠాపనలోనే కాకుండా, నిమజ్జన శోభాయాత్రలోనూ గ్రామం పాతకాలపు సంప్రదాయాన్ని ఆచరించి మరోసారి ప్రత్యేకతను చాటుకుంది.ఆధునిక వాహనాలకు భిన్నంగా, హనుమాన్ దేవాలయంలో పూజలందుకున్న వినాయక స్వామివారిని అత్యంత సుందరంగా అలంకరించిన ఎడ్లబండిపై ఉంచి ఊరేగించారు. గ్రామీణ కళలైన తమ్మెట–సన్నాయి, మంగళ వాయిద్యాల శబ్దాలు,భక్తుల కోలాటాలు,జయజయధ్వానాల మధ్య గ్రామ వీధుల గుండా భక్తిశ్రద్ధలతో శోభాయాత్రగా తీసుకెళ్లి నిమజ్జనం నిర్వహించారు . సంప్రదాయబద్ధంగా సాగిన ఈ నిమజ్జన వేడుకను చూసేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఆధునిక హంగులకు బదులుగా పూర్వీకుల కాలం నాటి గ్రామీణ సాంస్కృతి , సాంప్రదాయాలను గుర్తు చేసేలా శోభాయాత్ర నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మట్టి విగ్రహాల వినియోగంతో పర్యావరణ పరిరక్షణకు సందేశం ఇవ్వడంతో పాటు ,సాంప్రదాయ బద్ధమైన నిమజ్జన శోభాయాత్ర ల ద్వారా మన గ్రామీణ సంస్కృతిని భావితరాలకు అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు .ఇతర గ్రామాలు ,వినాయక మండపాల నిర్వహకులు కూడా ఇలాంటి పర్యావరణహిత ,సాంప్రదాయ పద్ధతులను అనుసరించేందుకు ఇది స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు .పర్యావరణాన్ని కాపాడుకుంటూ,మన ప్రాచీన సంస్కృతిని నేటి తరానికి పరిచయం చేసేలా ఉత్సవాలు నిర్వహించిన గ్రామ పంచాయతీని, సర్పంచ్ కాసం రాజశేఖర్‌ను,గ్రామ ప్రజలను పలువురు అభినందిస్తున్నారు.

## 'పోషణ్ మాసం' వేడుకలు

**ప్రజాపక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం చిన్న కొల్వాయ్ గ్రామంలో పోషణ మాసం షెడ్యూల్లో భాగంగా స్థానిక అంగన్వాడి కేంద్రాలలో పోషణ్ మాసం వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.సమాజంలో చిన్నారులు,గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 'పోషణ్ మాసం' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని,పిల్లలకు ఇంట్లోనే తయారుచేసిన పౌష్టికాహారాన్ని అందించాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ సువర్ణ పిలుపునిచ్చారు. అనంతరం పోషకాహార అవగాహనపై వీధుల్లో ర్యాలీ నిర్వహించి, హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగవ్వ, పంచాయతీ కార్యదర్శి నా రాయణ ప్రాథమిక పాఠశాల టీచర్ ప్రశాంత్, అంగన్వాడీ టీచర్ యశోద,తల్లులు, కిశోర బాలికలు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వందేమాతరం గేయ అలాపన కార్యక్రమం

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలో ని శ్రీ సరస్వతీ విద్యాపీఠం అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ న్యూ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఉన్న అన్ని శిశుమందిరాల ఆధ్వర్యంలో నమామి భారత్ సామూహిక సంపూర్ణ వందేమాతరం గేయ అలాపన కార్యక్రమం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ భైంసాలో నిర్వహిస్తున్నాము కావున ఈ కార్యక్రమంలో భైంసా పట్టణంలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ ప్రబంధకారిని సభ్యులు, పుర ప్రముఖులు, హితైషులు, యువజన సంఘాల సభ్యులు అందరు తప్పకుండ రాగలరని మనవి .కార్యక్రమం ఉదయం 10గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణతో ప్రారంభమౌతుంది 11:00గంటలకు సంపూర్ణ వందేమాతర అలాపనతో పూర్తి అవుతుంది కావున మీరు 9:50ని లకు తప్ప కుండ రాగలరిని మనవి.

## 27న భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా సమావేశం

**ప్రజాపక్షం / వాంకిడి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్షాభూమిలో ఈ నెల 27న భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహల్కర్ తెలిపారు. వాంకిడి మండల కేంద్రంలోని జేత్వన్ బుద్ధ విహార్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27న మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఉత్తర తెలంగాణ భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు గడపాలే ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞ కుమార్ రత్న ఝాడే ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ మార్పులు చేర్పులు, ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, ఆదాయ వ్యయాల నివేదికలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని బౌద్ధ బాంధవులు, ఉపాసకులు, అంబేద్కర్ వాదులు అధిక సంఖ్యలో



తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు వి.ఎస్. ప్రహ్లాద్ వైవేష్, ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు, ఆర్గనైజర్ సిహెచ్. తుకారాం, క్యాషియర్ దుర్గం తిరుపతి, జాయింట్ సెక్రటరీ పెర్చు ఆత్మారాం, శ్యామ్‌రావు దుర్గే, పుల్లయ్య కాంబ్లే, సంతోష్ ఝాడే తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అపోహలు వీడండి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** ఎయిడ్స్ పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించుకోవాలని, సకాలంలో పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డా. శ్రీనివాస్ పిలుపునిచ్చారు.నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లె సిద్దులు జన జాగృతి కళాజాత కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీమ్ నెం 2 కళాకారులచే జగిత్యాల వీక్లీ బజార్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూహెచ్ఐవి సోకినంత మాత్రాన జీవితం ముగిసినట్లు కాదని, ముందు జాగ్రత్త, అవగాహన చాలా ముఖ్యమన్నారు.హెచ్ఐవి ప్రధానంగా నాలుగు కారణాల వల్ల వ్యాపిస్తుందని, సురక్షితం కాని శృంగారం, కలుషిత రక్తం ఎక్కించడం, కలుషిత సూదులు, సిరంజిల వాడకం, హెచ్ఐవి ఉన్న తల్లి నుండి బిడ్డకు, షేక్ హ్యాండ్ ఇవ్వడం వల్ల, కలిసి భోజనం చేయడం వల్ల, దోమ కుట్టడం వల్ల, ఒకే మరుగుదొడ్డి వాడడం వల్ల హెచ్ఐవి వ్యాపించదని శ్రీనివా స్ స్పష్టం చేశారు.కళాకారుల సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లోకి తీసుకెళ్లాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.అనంతరం కళాకారులు బుర్రకథ, ఒగ్గుడోలు రూ పంలో హెచ్ఐవి నివారణపై పాటలు పాడి ఆకట్టుకున్నా రు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్లు, టీఎస్ఏసీఎస్ సిబ్బంది, స్థానిక ప్రజలు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పా ల్గొన్నారు.

## షాహిద్ కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండలానికి చెందిన నమస్తే తెలంగాణా దిన పత్రిక ప్రాత్రికేయుడు షాహిద్ మాతృమూర్తి కు ఇటీవల శాస్త్ర చికిత్స జరిగింది.విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు ఉమ్మడి జిల్లా మాజీ చైర్మన్,ముధోల్ సమన్వయకర్త సమితి సభ్యులు లోలం శ్యామ్ సుందర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట బి ఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యామ్ సుందర్,పిఏసిఎస్ చైర్మన్ రత్నాకర్ రావు,మాజీ ఎంపీపీ లక్ష్మి సాగర్,గ్రామ



సర్పంచ్ వెంకటేష్, మాజీ సర్పంచ్ దిగంబర్,మాజీ వైస్ ఎంపీపీ సాయన్న,సోషల్ మీడియా కన్వీనర్ బండి ప్రశాంత్, సందీప్ పాల్గొన్నారు.

## జిల్లా టాపర్ శ్వేతకు పురస్కారం

**ప్రజాపక్షం / జన్నారం :** పదో తరగతి పరీక్షల్లో 582 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన కిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని లసెట్టి శ్వేతకు రూ.2 లక్షల నగదు పురస్కారం లభించింది. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'చదువుకో తెలంగాణ' కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ఆమె గురువారం నగదు ప్రోత్సాహకం, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. మంచిర్యాల జిల్లా టాపర్‌గా నిలిచిన శ్వేత ప్రస్తుతం మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీలో మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రతిభ చాటి పురస్కారం అందుకున్న శ్వేతను జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, ప్రధానోపాధ్యాయులు గుండా రాజన్న, మండల విద్యాధికారి బి.రాజేందర్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

## రైతు రిజిస్ట్రేషన్ చేసి రైతుగా గుర్తించే పరిస్థితి ఎందుకు?

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** రైతులకు ఆంక్షలు పెట్టి రైతులకు అందించాల్సిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటుందని మాజీ జెడ్పి చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో రేవంత్ రెడ్డి పాలనలో రాక్షస పాలన తలపిస్తుందని అన్నారు. వ్యవసాయానికి నీళ్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతూ, సమయానికి కరెంట్ ఇవ్వకుండా అరిగోస పెడుతున్నారని అన్నారు. మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను మర్చిపోయారని, కనీసం కేసీఆర్ ఇచ్చిన 24గంటల ఉచిత నాణ్యమైన కరెంట్‌ను కూడా అందించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలిసి రైతు మెడ మీద కత్తిలాగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పెట్టారని అన్నారు. రైతు పండించిన పంటను అమ్ముకోవడానికి యాప్ ఎక్కడైనా ఉంటదా ప్రభుత్వం బాధ్యత మరిచి రైతుకు కొర్రి పెడుతుందని అన్నారు. దేని కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ పెట్టినట్లు, రైతులు ఇబ్బంది గురి చేసే విధంగా ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఉందని అన్నారు. పేద ప్రజలకు న్యాయం చేకూరే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయాలని కానీ రెండు కుమ్మక్కై పని చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తేలు రాజు, మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, నాయకులు రాంచందర్ రెడ్డి, చిరంజీవి, జగన్, మదన్, రమేష్, రాజన్న, రాయమల్లు, ప్రభాకర్ రెడ్డి, ప్రసాద్ గౌడ్, మల్లయ్య, మహేష్, రమేష్, సుంకం రమేష్, ఆనంద రెడ్డి, రాజు, తిరుపతి, శ్రీనివాస్, శ్రీను, నరసింహ రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

## వేలం పాటలో గణపతి లడ్డు దక్కించుకున్న ముస్లిం యువకుడు



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల పట్టణంలోని గోవిందపల్లె టీం సెవెన్ యూత్ గణేష్ మండపం మతసామరస్యానికి వేదికయింది. పది రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణపతి చేతిలోని లడ్డును గురువారం మంటప నిర్వాహకులు వేలంవేయగా రూ. 70 వేలకు వేలం పాట పాడి ఒక ముస్లిం యువకుడు గణపతి లడ్డును దక్కించుకొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాడు. గణేష్ నగర్ కు చెందిన ప్రముఖ గాయకుడు ఎం.డి అభికుమారుడు మహమ్మద్ ఇషాన్ బాల్యం నుండే వినాయక చవితి నవరాత్రులను తన స్నేహితులతో కలిసి ఘనంగా నిర్వహిస్తుండేవాడు. ముస్లిం మతస్తుడు అయినప్పటికీ కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గణేష్ నవరాత్రుల సమయంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడమే కాకుండా ఉపవాస దీక్షను కూడా చేపడుతుండేవాడు. ఈ ఏడు తన మిత్రులతో కలిసి గణేష్ ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా వేలం పాటలో గణేష్ లడ్డూను రూ. 70 వేలకు దక్కించుకోవడం పట్ల ఇషాన్ ను పలువురు అభినందించారు. కులం, మతం పేర్లతో వైషమ్యాలు చోటు చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో కులమేదైనా, మతమేదైనా మనమంతా భారతీయులం అనే భావనతో పాటు తన మతాన్ని ఆచరించడంతోపాటు ఇతర మతాలను కూడా గౌరవిస్తాము అనే సందేశాన్ని మహమ్మద్ ఇషాన్ సమాజానికి అందించాడని ఆయన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.